క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న విజయ్, శ్రీనివాసరావు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీవీఎంసీ 52వ వార్డు కరాసా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జియ్యాని విజయ్, వైఎస్సార్ సీపీ నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీవో సుధారాణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిరక్షణ

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 884వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పోరాట కమిటీ ప్రతినిధులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: ప్రేమించిన యువతి కాదనడంతో యువకుడు గురువారం పెందుర్తి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ..పెందుర్తి మండలం గంగమ్మపేట గ్రామానికి చెందిన సోర్నపూడి చరణ్‌కుమార్(21) గోపాలపట్నంకు చెందిన యువతిని ప్రేమించాడు. ఇతని తండ్రి చిన్నప్పుడే చనిపోగా తల్లి రాము పెంచి డిప్లమో వరకూ చదివించింది. సదరు యువతి వేరే ప్రాంతంలో ఉద్యోగం చేసుకుంటుంది. తరచూ ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించడం, ఆమె సమాధానం ఇవ్వకపోవడంతో ఈనెల 12వ తేదీన చరణ్‌కుమార్ తన తల్లిని తీసుకుని ఆ యువతి ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులతో వాదోపవాదాలు చేయగా, యువతి తల్లిదండ్రులు గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే చరణ్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. మరుసటిరోజు 13వ తేదీన చరణ్ పెందుర్తి సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు.

సీఎం జగన్ పాలనకు.. జన నీరాజనం

- మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి
- సర్వే రిపోర్టులు స్పష్టం చేస్తున్నది అదే
- పాలనలో రికార్డు సీఎం జగన్‌దే
- 'గడప గడపకు..'కార్యక్రమంలో ఆనంద్‌కుమార్



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జనం నీరాజనం పడుతున్నారని, ఇటీవల వెలువడిన పలు సర్వే రిపోర్టులే దీనికి నిదర్శనమని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలనే ఆలోచనతో జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,915 శిబిరాలు నెలకొల్పి 36 లక్షల మందికి న్యాయం చేకూర్చి సరికొత్త రికార్డు నెలకొల్పారన్నారు. ఇలాంటి రికార్డు గత ప్రభుత్వానికి చేతనైందా? అని ప్రశ్నించారు. జగన్ ఒక నమ్మకం, జగన్ ఒక బలం.. అయన మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం ఏ ఒక్క పేద కుటుంబం పస్తులతో గానీ, గూడు లేక గానీ, ఉపాధి లేక గానీ బాధపడదని అన్నారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జి.ఎల్.వి. నరేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబర్ మళ్ల ధనలత, సూరాడ అనుదీప్, ఆదారి హరీష్, త్రినాథ్, సత్తిబాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఓ అన్నలా అండదండలు అందించారు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ. 9 లక్షల వరకు సాయం అందించారు. ఇంత మొత్తం సొంత వారు సైతం ఇవ్వలేరు. ఆయన ఓ అన్న మాదిరిగా మాకు అండగ నిలిచారు. జగనన్నకు ఎల్లప్పుడూ మా ఇంటిల్లిపాదీ రుణపడి ఉంటాం.

అంగ శాంతి, ఇందిరాకాలనీ.

అన్న రుణం తీర్చుకోలేనిది



వైఎస్సార్ బీమా ద్వారా రూ. 2 లక్షలు, పెన్షన్ ద్వారా రూ. 82,950, రైతు భరోసా ద్వారా రూ. 12 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ. 12 వేలు సాయం అందించారు సీఎం జగనన్న. ఆయన చేసిన సాయాన్ని ఎప్పుడూ మరిచిపోము. ఆయన వెంటే ఎల్లప్పుడూ నడుస్తాం.

– బి.గంగాభవానీ, ఇందిరాకాలనీ.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఇందిరానగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో పలు అభివృద్ధి పనులకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ప్రశాంతి నగర్, ఇందిరానగర్, ఎస్సీబీసీ కాలనీల్లో రహదారులు, కాల్వల పనులకు జీవీఎంసీ నిధులు రూ.34లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీ కృష్ణ, కంపర కోటేశ్వరరావు, రమేష్, నమ్మి శ్రీను పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీసీ రాజీవ్‌కుమార్

మల్కాపురం : ఆయిల్ లారీ, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం ట్రాఫిక్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో వై. జంక్షన్ వద్ద గల పోర్టు ఏరియా లారీ యూనియన్ కార్యాలయం వద్ద శనివారం ఈ కార్యక్రమం జరిగింది. జోన్–2 ట్రాఫిక్ విభాగం ఏసీపీ రాజీవ్‌కుమార్ అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొంత మంది భారీ వాహనాల డ్రైవర్లు సేవామార్గాలపై నిర్లక్ష్యంగా వాహనాలు నిలిపేస్తున్నారని, వీటిని రాత్రి సమయంలో గుర్తించలేక పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపటం,సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించి వాహనాలలో ప్రయాణికులను ఎక్కించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా డ్రైవింగ్ చేయాలన్నారు. నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ తులసీదాస్, ఎస్ఐ సుదర్శన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు



యల్లపువానిపాలెంలో పిచ్చిమొక్కలతో శ్మశానవాటిక



పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత ..

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం శ్మశాన వాటికలో పేరుకు పోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించి బాగు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల పైడిరాజు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ సొంత నిధులతో శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల భాగస్వామ్యం



శ్రీనుబాబునగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు అన్నారు. శ్రీనుబాబు నగర్‌లో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైతు బజారును సందర్శించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫీడ్ బ్యాక్ పలువురిని మొబైల్‌లో చేర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ వెంకటరమణ, మలేరియా ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు, రైతుబజారు ఈవో నారాయణరావు, సచివాలయ కార్యదర్శులు బండారు శ్రీనివాస్, బాలాజీ, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులపై ఆరా



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఏం తల్లి ఎలా ఉన్నారు..ఎలా చదువుతున్నారు..పాఠశాలలో వసతులు.. బోధన ఏ విధంగా ఉంది అని జీవీఎంసీ పాఠశాల విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంధ్‌కుమార్ ముచ్చటించారు. తన పర్యటనలో భాగంగా 60వ వార్డు జనతాకాలనీ ప్రాంతంలో శనివారం వెళ్తున్నారు.ఆ సమయంలో అటుగా మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తున్నారు. వారిని చూసి తన వాహనాన్ని నిలిపి విద్యార్థుల వద్దకు ఆదారి ఆనంధ్‌కుమార్ వెళ్లారు.వారితో కొంత సేపు ముచ్చటించి,పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, బోధన అంశాలను అడిగి తెలుసుకున్నారు. తమకు ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందిస్తున్నారని,చక్కటి భోజనం పెడుతున్నారని విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం

మల్కాపురం: విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించడానికి అందివచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ పూర్వ ప్రొగ్రాం అధికారి ఎ.ఆదిలక్ష్మి అన్నారు. మల్కాపురం,సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం మహిళా సాధికారత తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల కరస్పాండెంట్ గెసిల్లా మాట్లాడుతూ డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని కళాశాల విద్యార్థులకు ఆమె జీవిత చరిత్ర,దేశం కోసం ఆమె చేసిన పోరాటాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు.కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు అంజిలిదేవి,ప్రశాంతి,ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీలకు ఆహ్వానం

సీతంపేట: సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శిగా వ్యవహరించిన నూనెల శ్రీనివాసరావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని అభ్యుదయ కవితలు, మినీ కవితల పోటీ నిర్వహించనున్నట్టు సంస్థ కన్వీనర్ పెంటకోట రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ ఉత్తమ కవితకు రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1,500, తృతీయ బహుమతిగా రూ.1,000 అందిస్తామని చెప్పారు. 82477 97303, 94900 99222 నంబర్లకు వాట్సాప్ ద్వారా గాని, సాహితీ స్రవంతి విశాఖ జీ మెయిల్‌కు గాని ఈ నెల 20లోగా కవితలు పంపించాలని ఆయన కోరారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



62వ వార్డులోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

సింధియా: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలను అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలించారని విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో శనివారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, ఇతర నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు అయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రూ.20 లక్షలతో పనులు చేపడుతున్నట్టు చెప్పారు. నాణ్యతలో రాజీ లేకుండా అత్యుత్తమ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వార్డు అధ్యక్షులు భీశెట్టి గణేష్, నాయకులు జీవీఎల్ నరేష్, కన్నబాబు, మాధవి, గలగళ్ల లక్ష్మణరావు, కామేశ్వరరావు, సూరాడ అనుదీప్, నక్కా సూర్యనారాయణ, నాగభూషణం, డాక్టర్ చింతాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వైద్యులు, ఏఎన్ఎంలతో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం సీజనల్ వ్యాధులపై ఏఎన్ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వానా కాలం నేపథ్యంలో వర్షాలు విస్తరంగా కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో వ్యాధుల కట్టడికి వైద్యులు, ఏఎన్ఎంలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నేషనల్ ఫీవర్ హెల్త్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మార్గదర్శక సూత్రాల ప్రకారం సర్వే చేసి వివరాలను యాప్స్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ విషయంలో ఏఎన్ఎంలు, వైద్యులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు డాక్టర్ సత్యవేణి, డాక్టర్ సమత, నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, వివిధ ప్రొగ్రాంల అధికారులు పాల్గొన్నారు.

108 రథసారథులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ (ఏఇఎంఎస్) ఆధ్వర్యంలో నడిపిస్తున్న 108, 104,102 సర్వీసులో పని చేస్తున్న పైలెట్లకు శిక్షణ నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు వర్షాకాలం నేపథ్యంలో పైలెట్లకు డ్రైవింగ్‌లో మెలకువలు, సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, డిస్ట్రిక్ట్ మేనేజర్ త్రినాథ్, విశాఖ సిటీ కోఆర్డినేటర్ సురేష్, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హెచ్‌పీసీఎల్ ఆవిర్భావ దినోత్సవం



గ్యాస్ డెలివరీ బాయ్‌కి మొక్క అందజేస్తున్న మహేష్‌రామ్

సింహాచలం: కరోనా సమయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా చేయడంలో డెలివరీ బాయ్స్ ప్రధాన పాత్ర పోషించారని హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ మహేష్‌రామ్ కొనియాడారు.హెచ్‌పీసీఎల్ 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని 94వవార్డు వేపగుంటలోని సత్యమహాలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌రామ్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ 49ఏళ్లు పూర్తి చేసుకుని 50వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ గొడౌన్ ఆవరణలో మొక్కలు నాటారు. డెలివరీ బాయ్స్‌కు మొక్కలు అందజేశారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎల్‌పీజీ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అన్నవరపు సుందరవదన్, డిప్యూటీ సేల్స్ మేనేజర్ మురళీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్స్) ప్రేమ్‌కుమార్ జ్యోతి, చీఫ్ మేనేజర్ సంజయ్‌కుమార్, ఏరియా సేల్స్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

18న మెగా జాబ్ మేళా

గాజువాక: వివిధ కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, వరుణ్ మోటార్స్, బీమా జ్యువల్స్, అపోలో ఫార్మసీ, ట్రెన్ దాబా తదితర కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. మొత్తం 260 పోస్టులకు ఎంపిక జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు అర్హత ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతభత్యాలుంటాయని తెలిపారు. అభ్యర్థులు విశాఖ, నక్కపల్లి, గాజువాక, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెకానికల్, మెకానికల్ డిప్లమా, ఐటీఐ ఫిట్టర్, డీజిల్ మెకానిక్, బీ, డీ, ఎం ఫార్మసీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని, మంగళవారం ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 92925 53352 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.